క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరి రూరల్: పట్టణంలోని కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ నాగేశ్వరరావు తెలిపారు. కొత్తూరు సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ నూతన ట్రాన్స్ ఫారం ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కొత్త ట్రాన్స్‌ఫారం ఏర్పాటుతో ఆ ఫీడర్ పరిధిలో లో ఓల్టేజీ, విద్యుత్ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

కొండపి: జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలోని పోలేరమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో దేవస్థాన ప్రాంగణం కిక్కిరిసింది.

ఖాళీ స్థలం లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

కనిగిరి రూరల్: స్థానిక డిపో ఆవరణలోని 1950 చ.గజాల ఖాళీ స్థలాన్ని బీఓటీ పద్ధతిలో లీజుకు తీసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ ఆదివారం తెలిపారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆగస్టు 1వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ప్రాంతీయ అధికారి కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు డీఎం నంబర్ 9959225701ను సంప్రదించాలని కోరారు.

మనం ఫ్రెండ్స్ దాతృత్వం


నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మిత్రులు

టంగుటూరు: టంగుటూరులో 1991–96 వరకు కలిసి చదువుకున్న మిత్రులు మనం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ పేరుతో ఒక సంఘంగా ఏర్పడి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఒంటరి మహిళలకు, అంగవైకల్యం కలిగిన తోటి మిత్రుడికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే వెంకటాయపాలెం ఎస్టీ కాలనీలో నిరు పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇతర మెటీరియల్ అందించారు. రోడ్ల వెంట అనాథలకు భోజనం పంపిణీ చేశారు.

ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం


జానకి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కందుకూరు రూరల్: మండలంలోని జి.మేకపాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన యాగంటి జానకిని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలో సుదీర్ఘకాలం పని చేసి ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయురాలు జానికి సేవలను కొనియాడారు. ఇందుకూరుపేట, కావలి ఎంఈఓలు ఎస్.వెంకటేశ్వర నాయక్, బండి గోవిందయ్య, పాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని జానకి దంపతులను సన్మానించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పామూరు: మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, ఎంఈఓ జి.కరుణకుమారి అన్నారు. స్థానిక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం ఎస్ఓ కటకం సజన ఆధ్వర్యంలో హరితవనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ముఖ్యంగా విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ తేడా లేకుండా ప్రతి పాఠశాల, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మొక్కలు నాటి సుందర వనాలుగా తీర్చిదిద్ది తద్వారా స్వచ్ఛమైన వాతావరణం ఏర్పరచాలన్నారు. తద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని, ఇది భావితరాలకు మనం ఇచ్చే వరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ వాణి, ఎన్‌జీఓ షేక్.నాయబ్ రసూల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండను అరికట్టాలి


కందుకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు


ఉలవపాడులో నిరసన ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

కందుకూరు: మణిపూర్‌లో జరుగుతున్న హింసకు బాధ్యత వహించి మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం మోహన్‌రావు జిల్లా నాయకులు ముప్పరాజు కోటయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మాన నోటీసు ఇస్తే చర్చ చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. మణిపూర్ మహిళలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలన్నారు. సీపీఎం నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఎస్ఏ గౌస్, జీవీబీ కుమార్, వెంకయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దారుణాలను అరికట్టాలని జేడీబీఎం టౌన్ బాప్టిస్టు చర్చి సంఘ కాపరి రెవరెండ్ గడ్డం జాన్ డిమాండ్ చేశారు. మణిపూర్ హింసను నిరసిస్తూ జేడీబీఎం చర్చి ఆధ్వర్యంలో స్థానిక చర్చి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని అందుకు ఉదాహరణ మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులేనన్నారు. కుకీ తెగకు చెందిన క్రైస్తవులను కిరాతకంగా చంపుతూ,


కందుకూరులో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

స్త్రీలను వివస్త్రలను చేసి ఊరేగిస్తూ ఆనందం పొందుతున్నారన్నారు. ఇటువంటి చర్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని, ఇటువంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అరికట్టాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించి క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ పెద్దలు జంగాల ప్రభుకుమార్, మద్దాలి రమేష్, కొండేటి కరుణాకర్, విజయకుమార్, చదలవాడ శ్యామ్‌సుధాకర్, చదలవాడ కొండయ్య, సూరపోగు ఏసుదాస్, స్త్రీల సమాజం ప్రతినిధులు జంగాల మణిరవి, సూరపోగు రోజులీల పాల్గొన్నారు.

ఉలవపాడు: మణిపూర్‌లో మైనారిటీ తెగలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఉలవపాడులో క్రైస్తవ సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు బహుజన టీచర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. స్థానిక బస్‌స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు ప్రసంగించారు. పాస్టర్ల సంఘ నాయకులు కుమార్, ప్రశాంత్, కాలేబు. భాస్కరరాజా, ఆశీర్వాదం బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకలు బండిగోవిందయ్య, ప్రభాకర్, కోటేశ్వరరావు, భాస్కరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


గుడ్లూరులో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

గుడ్లూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా గుడ్లూరులో సార్వత్రిక కడబూర చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవలు ఆదివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ లో జరుగుతున్న అల్లర్లు సర్దుమణగాలని ప్రార్థనలు చేశారు. దాడులను ఖండించారు. కార్యక్రమంలో పాస్టర్లు సందేశ్, ఆనంద్, జాషువా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మగిసిన మొహర్రం వేడుకలు


రామాయిపల్లిలో పీర్ల గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు


రామాయిపల్లిలో మొహర్రం ఉత్సవ వేడుకల్లో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు


నందనవనంలో గ్రామోత్సవంలో పీర్ల ఎత్తుకొని గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

హనుమంతునిపాడు: మండలంలో మొహర్రం వేడుకల పెద్ద షరిగత్ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. రామాయిపల్లి, వీరరాంపురం, నందనవనం, మహమ్మందాపురం, ఉసుల్లపల్లి గ్రామాల్లో పెద్ద షరిగత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు, మొక్కుబడులు ఉన్న వారు నైవేద్యాలు, పూజా సామాగ్రితో నిప్పుల గుండం చుట్టూ ప్రదక్షణలు చేసి పీర్లకు సమర్పించారు. పీర్ల చావిడిలో కొలువైన పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాల సందడితో గ్రామోత్సవం వైభవంగా సాగింది. పీర్ల చావిడిల ముందు ఏర్పాటు చేసిన నిప్పుల గుండం చుట్టూ భక్తులు పీర్లను ఎత్తుకొని ప్రదక్షణలు చేసి భక్తులు పీర్లను ఎత్తుకొని నిప్పుల గుండంలో నడిచారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు, హిందువులు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని పీర్ల దర్శనాలు అందుకున్నారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి రామాయిపల్లిలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో పాల్గొని పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. పీర్ల దర్శనాలు అందుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల స్నానాలతో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి.

కారుమంచిలో కాఫీ విత్ గృహసారథి


గృహ సారథి నివాసంలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: మండలంలోని కారుమంచి గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గం ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కాఫీ విత్ గృహ సారథి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన గృహ సారథి పోట్లూరి శ్రీను నివాసాన్ని సందర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామ ప్రజల సమస్యలను వలంటీర్ల సహాయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎస్టీ కాలనీ వాసులు ఆధార్ కార్డుల సమస్య తెలియజేయగా అధికారులతో మాట్లాడి ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే కాంట్రాక్టర్‌ను పెట్టి గృహ నిర్మాణ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆనం సత్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్లు బుర్లా శ్రీను, మన్నం శ్రీను, కంజుల వెంకటరామిరెడ్డి, పోట్లూరి వెంకట్రావు, ఆంజనేయులు, మానికల శ్రీను, పోట్లూరి రమేషు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం

పామూరు: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా ప్రస్తుతం చేస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు సేవాసంస్థ నూతన అధ్యక్షుడు పోలక తిరుపతిరెడ్డి అన్నారు. సంస్థ కమిటీ సమావేశం ఆదివారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాదిగా మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా అందించిన సేవలను గుర్తి చేసిన వారు త్వరలో ఉచిత మెగావైద్యశిబిరం నిర్వహించడంతో పాటు, పేదలకు చేయూతగా భౌతికకాయాలను ఉచితంగా శ్మశానానికి తరలించేందుకు ఉచితవాహనం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నూతన కమిటీ సేవాకార్యక్రమాల పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, డీవీ మనోహర్, కోడూరి ప్రభాకర్, రంగారెడ్డి, పలువురు నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సంస్థ కార్యక్రమాల ప్రచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తల్లీకూతురును కబళించిన రైలు

● మూత్ర విసర్జనకు వెళ్తుండగా ఘటన

నెల్లూరు(క్రైమ్): మూత్ర విసర్జనకు రైలు పట్టాల మీద నడుచుకుంటూ వెళుతున్న తల్లీకుమార్తెను రైలు ఢీకొనడంతో మృతి చెందారు. ఈ హృదయ విదారక ఘటన ఆత్మకూరుబస్టాండు సమీపంలో రైలుపట్టాలపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన ఫాతిమా అలియాస్ ఫాతిమున్నీసా(60)కు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికి వివాహమైంది. పెద్ద కుమార్తె మెహరున్నీసా శింగరాయకొండ, చిన్నకుమార్తె గౌసియా(35)కందుకూరులో ఉంటున్నారు. రొట్టెల పండగకు తల్లీకుమార్తెలు కలిసి ఆదివారం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకొచ్చారు. దర్గాను సందర్శించుకుని హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో మెహరున్నీసా రైల్వేస్టేషన్‌లో ఉండగా ఫాతిమున్నీసా, గౌసియా మూత్రవిసర్జన చేసేందుకు రైలుపట్టాల వెంబడి ఆత్మకూరుబస్టాండ్ వైపు వెళ్లారు. రైల్వే బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి నిజాముద్దీన్ వెళుతున్న రైలు వారిని ఢీకొంది. ఫాతిమున్నీసా అక్కడికక్కడే మృతి చెందగా గౌసియా రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు 108 సాయంతో చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌసియా మృతి చెందింది. తల్లి, చెల్లెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మెహరున్నీసా కన్నీటిపర్యంతమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై ఎన్ హరిచందన పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుల కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు నెల్లూరుకు బయలుదేరారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.


ఘటనా స్థలంలో ఫాతిమున్నీసా మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన

పికెట్ ఏర్పాటు

గతంలోనూ ఇదే ప్రాంతంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. రైల్వే పోలీసులు గస్తీని ఏర్పాటు చేసిన ప్రయాణికులు పెడచెవిన పెట్టి రైలుపట్టాలపై రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. ఆదివారం తల్లీకుమార్తె రైలుపట్టాలపై వెళుతుండగా, అటుగా వెళుతున్న వారు వారిస్తుండగానే రైలు వారిని ఢీకొంది. దీంతో రైల్వే పోలీసులు అక్కడ పికెట్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులు అటుగా వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

రోటరీ సంస్థ సేవలకు సంపూర్ణ సహకారం

● వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అశోక్‌బాబు

సింగరాయకొండ: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గీతా మందిరంలో ఆదివారం రోటరీ క్లబ్ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరికూటి మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ వారు సేవను ఒక వ్యవసనంగా మార్చుకుని పేదలకు తోడ్పాటునిస్తున్నారని కొనియాడారు. తాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 1,03,600 గడపలు తిరిగానని, పేదలందరికీ పథకాలు అందించడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. నూతన కార్యవర్గంతో రోటరీ క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారి శివన్నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షునిగా మాలె రంగారెడ్డి, సెక్రటరీగా పంతగాని వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నాగసూరి వెంకట సుబ్బారావు ప్రమాణం చేశారు. అనంతరం 12 మంది పేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు అందజేశారు. రోటరీ పబ్లిక్ ఇమేజ్ ఇన్‌చార్జి సాంబశివరావు, అసిస్టెంట్ గవర్నర్ ప్రసాద్, జెట్టి చంద్రశేఖరరెడ్డి, షేక్ పటేల్, పఠాన్ రియాజ్, ప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అశోక్‌బాబు

ఘనంగా ఉళ్లేరమ్మ గ్రామ దేవత కొలుపులు


ఊరేగింపులో వరికూటి అశోక్‌బాబు

జరుగుమల్లి: మండలంలోని పంగులూరివారిపాలెం గ్రామంలో ఆదివారం ఉళ్లేరమ్మ గ్రామ దేవత కొలుపులను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ముందుగా గ్రామస్తులు కుంకుమ బండ్లు కట్టి ఊరేగించారు. అనంతరం కె.బిటగుంట, రెడ్డిపాలెంలో గంగమ్మ తల్లి కొలుపుల్లో అశోక్‌బాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పిన్నిక శీనివాసరావు, దుంపా అనిల్ కుమార్‌రెడ్డి, బల్లాల అనిల్‌కుమార్‌రెడ్డి, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, కొమ్మాలపాటి మధన , బత్తిన మనోహరు, చుండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదో తరగతి చదివిన 50 మంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొని తమ చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో పలు రంగాల్లో రాణిస్తున్న స్నేహితులు అందరూ ఒకేచోటకు చేరడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా కాసేపు చిన్నపిల్లలు లా మారిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సమావేశానికి ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. తమతో పాటు చదువుకుని ఇటీవల కాలంలో మృతి చెందిన పలువురు స్నేహితులకు నివాళులర్పించారు. అనంతరం సాయంత్రం వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా పాల్గొన్నారు. యన్‌ఆర్ఐ కోర్నిపాటి మధుసూధనరెడ్డి, కోకా చిరంజీవి, పోలం నాగరాజు, కాపులూరి శ్రీనివాసులు, గుండవరపు సుబ్బానాయుడు, రాజేశ్వరి, విద్యుల్లత ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు.

భైరవకోనలో వాటర్‌ట్యాంక్‌కు భూమిపూజ

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో జలపాతంవద్ద భక్తుల సౌకర్యార్థం దాతల సాయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాటర్‌ట్యాంకు నిర్మాణంకు ఆదివారం కమిటీ సభ్యులు దాతతో కలిసి భూమిపూజ చేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డ్ మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డి చొరవతో పూనేకు చెందిన పారిశ్రామికవేత్త దాత మాఘం శ్రీనివాసులు రూ.7లక్షల సొంత నిధులతో జలపాతంవద్ద 30 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు రామ్మూర్తిశర్మ, సుధాకర్‌శర్మల వేదమంత్రాల నడుమ ట్రస్ట్‌బోర్డ్ మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డితోకలిసి దాత శ్రీనివాసలు వాటర్‌ట్యాంకు నిర్మాణానికి భూమిపూజచేశారు. వారు మాట్లాడుతూ ట్యాంకు నిర్మాణం పూర్తయితే భక్తులకు నీటిసౌలభ్యం కలుగుతుందన్నారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాదికారి నర్రా నారాయణరెడ్డిలు దాతను అభినందించారు. కార్యక్రమంలో మాఘం లక్ష్మీనరసింహ, భక్తులు పాల్గొన్నారు.


వాటర్‌ట్యాంకు భూమిపూజచేస్తున్న ఆలయ కమిటీ, దాత

ఒరిగిన విద్యుత్ స్తంభం

జరుగుమల్లి: స్థానిక పశువైద్యశాల పక్కన దావగూడూరు గ్రామం వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ తీగలపై చెట్టు కొమ్మ పడటంతో స్తంభం ఓ వైపునకు ఒరిగింది. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. దావగూడూరు, చింతలపాలెం, చిరికూరపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచింది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు తాత్కాలికంగా నర్సింగోలు సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రెండు రోజుల్లో నూతన స్తంభం ఏర్పాటు చేస్తామని ఏఈ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహా నివేదన

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ కార్యక్రమం రుత్వికులు వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవును శుభ్రంచేసి అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అదేవిధంగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి తేనె, పాలు, పంచదార, పెరుగు, నెయ్యితో పంచామృతాభిషేకం చేశారు. అనంతరం బెల్లంపొంగలిని మహానివేదనగా సమర్పించేందుకు భజంత్రీల మేళతాళా నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, కమిటీ సభ్యులు మంచికంటి మధుసూదర్ రావు, కొమ్మినేని వెంకటరావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మహానివేదనతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు

రేపు ఉచిత పశు వైద్య శిబిరం

టంగుటూరు: మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా సోమవారం ఉదయం 8 గంటలకు ఉచిత పశు వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యులు మండల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పశుసంవర్ధక శాఖ డాక్టర్లు పాల్గొని ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. చుట్టు పక్కల గ్రామాల రైతులు కూడా వినియోగించుకోవాలని కోరారు.

షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విజేత అశోక్, చంద్రశేఖర్


విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఇండోర్ స్టేడియంలో పట్టణ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 28 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతిని అల్లాడి అశోక్, ఈర్ల చంద్రశేఖర్, ద్వితీయ బహుమతిని సన్నెబోయిన కార్తీక్, పసుపులేటి పవన్, మూడో బహుమతిని రాకేష్, రసూల్ సాధించారు. విజేతలకు రోటరీ క్లబ్ మండల కోశాధికారి నాగసూరి వెంకట సుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కాలేజీ పీడీ శంకరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కొండపిలో రెస్టారెంట్లపై ఎస్ఈబీ దాడులు

కొండపి: కొండపిలోని వివిధ రెస్టారెంట్లపై సింగరాయకొండ ఎస్ఈబీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్ముతున్న యజమానులపై కేసులు నమోదు చేశారు. ఎస్ఈబీ సీఐ దయాకర్ తెలిపిన వివరాల మేరకు.. కొండపిలో గత కొన్ని రోజులుగా రెస్టారెంట్లలో మద్యం విక్రయిస్తున్నట్లు ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక టంగుటూరు రోడ్డులోని కేబీ రెస్టారెంట్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 33 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రెస్టారెంట్ నిర్వాహకుడు నాయుడుపై 34ఏ కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరురుస్తామని చెప్పారు.